సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 11 । అక్టోబర్ । 2023



గంజాయి సాగుదారులపై కేసు

గంజాయిని సాగు చేస్తున్న ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసి తొమ్మిది మందిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. 10లో



ప్రకృతి సాగుతో లాభాలు

పాలకొండలో ప్రకృతి విధానంలో సాగు చేస్తున్న పంటలను ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ ప్రతినిధులు సందర్శించారు. 10లో



కనకమ్మకు అష్టదళ పద్మారాధన

విశాఖ నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.

న్యూస్‌రీల్

కల్చరల్ ఫెస్ట్‌లో ఏకలవ్య విద్యార్థి చరణ్ ప్రతిభ



చరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అన్నామణి, ఉపాధ్యాయులు

చింతపల్లి రూరల్: ఉత్తరాఖండ్ **డెహ్రాడూన్‌లో** జరిగిన జాతీయస్థాయిలో **కల్చరల్ ఫెస్ట్‌లో** సోలో డ్రామా విభాగంలో చింతపల్లి ఏకలవ్య పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థి ఎస్.చరణ్ ప్రతిభ కనబర్చాడు. ద్వితీయ స్థానం సాధించినట్టు ప్రిన్సిపాల్ అన్నామణి తెలిపారు. ఈ నెల మూడు నుంచి 6వ తేదీ వరకు జరిగిన కల్చరల్ ఫెస్ట్‌లో దేశ వ్యాప్తంగా 22 రాష్ట్రాలనుంచి ఏకలవ్య పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. మన రాష్ట్రం తరఫున చరణ్ ఎంపిక కావడం గర్వ కారణమన్నారు. ఈ సందర్భంగా చరణ్‌ను అభినందించారు.

వచ్చే నెల 27న అడవితల్లికి హారతి

- జ్యోతిర్మయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చలపతిరావు

చింతపల్లి రూరల్: మండలంలో తాజంగి పంచాయతీ కేంద్రం దొంతులమ్మ కొండపైన అడవి తల్లికి హారతి పేరిట తాజంగిలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు జ్యోతిర్మయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చలపతి రావు ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటక ప్రాంతమైన లంబసింగికి సమీపంలోఉన్న దొంతులమ్మ కొండకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా ప్రవచనకర్త కొండవీటి జ్యోతిర్మయి వచ్చే నెల 26న ఈ ప్రాంతానికి విచ్చేస్తారన్నారు. ఆమె చింతపల్లి మండలంలో పలు ప్రాంతాల్లో పర్యటిస్తారని ఆయన వెల్లడించారు. దొంతులమ్మ కొండపై 27వ తేదీ ఉదయం గిరిజన భక్తులతో భజన కార్యక్రమం నిర్వహిస్తారని ఆమె పేర్కొన్నారు.

ఏఎస్పీ కొత్తపల్లి జలపాతం సందర్శన



కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించిన పాడేరు ఏఎస్పీ ధీరజ్

జి.మాడుగుల: మండలంలో కొత్తపల్లి జలపాతాన్ని మంగళవారం పాడేరు ఏఎస్పీ ధీరజ్ సందర్శించారు. జలపాతాల వద్ద సీసీ కెమెరాలు, హ్యాండ్ మౌత్ సిస్టం వివరాలను నిర్వాహకుల నుంచి తెలుసుకున్నారు. కొత్తపల్లి జలపాతంతోపాటు పరిసర ప్రాంతాలకు అనేక ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారని, వారికి భద్రత పరంగా నిర్వాహకులకు తగు సహకారం అందిస్తామన్నారు. అనుమానితులు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. గంజాయి సాగు, రవాణాకు సహకారం అందించే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సీఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

‘నీతి ఆయోగ్’లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు రేపు

సాక్షి, పాడేరు: నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో ఉద్యోగాలకు ఈనెల 12న రెండో విడత ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తొలి విడతలో ఎంపికైన 19 మంది అభ్యర్థుల జాబితాను జిల్లా కలెక్టర్ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు. అంతేకాకుండా పాడేరులోని సీపీవో కార్యాలయం నోటీసుబోర్డులో కూడా ఏర్పాటు చేశామన్నారు. వీరంతా ఈనెల 12న రంపచోడవరం ఐటీడీఏ జరిగే మౌఖిక పరీక్షలకు హాజరు కావాలని ఆయన కోరారు.

పురుగుమందు తాగి గిరిజనుడి ఆత్మహత్య

చింతపల్లి: మద్యం తాగ వద్దని భార్య మందలించినందుకు ఓ గిరిజనుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని పెండ్లిమామిడిలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలను ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. పెండ్లిమామిడికి చెందిన కొర్రా బాలయ్య (54)ను మద్యం తగవద్దని అతని భార్య పదే పదే వారించేది. దీంతో మనస్తాపానికి గురైన బాలయ్య సోమవారం సాయంత్రం పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించినట్టు ఆయన పేర్కొన్నారు.

ఉద్యాన వికాసం

- గంజాయి సాగుకు స్వచ్ఛందంగా స్వస్తి
- పండ్ల తోటలు, వెదురు పెంపకం చేపట్టిన గిరి రైతులు
- ఉపాధి హామీ నిధులతో ప్రోత్సాహం
- పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- సత్ఫలితాలిస్తున్న ఆపరేషన్ పరివర్తన

జిల్లాలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. గతంలో గంజాయి సాగు చేపట్టిన భూముల్లో గిరి రైతులు ప్రభుత్వ సహకారంతో పండ్ల తోటలను పెంచుతున్నారు. ఆపరేషన్ పరివర్తన్‌లో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధిస్తున్నారు.



నుర్మతిలో గిరిజనులకు సిల్వర్‌ఓక్ మొక్కలను పంపిణీ చేస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా



నారింజ తోటలను పరిశీలిస్తున్న అధికారులు



చింతపల్లి మండలం పలడ గ్రామంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు

సాక్షి,పాడేరు: ఒకప్పుడు గంజాయి మొక్కలతో నిండి ఉండే భూములు నేడు ఉద్యానవన పంటలతో కళకలాడుతున్నాయి. ఆపరేషన్ పరివర్తనలో భాగంగా గిరిజనులు స్వచ్ఛందంగా గంజాయి తోటలను ధ్వంసం చేశారు. ఆభూముల్లో వివిధ రకాల పంటల సాగు చేపట్టి ఆర్థికాభివృద్ధికి బాటలు వేసుకుంటున్నారు.వీరికి అవసరమైన సహాయ సహకారాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్ సిన్హా అందిస్తున్నారు.

దీర్ఘకాలిక పంటలకు

ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా గంజాయికి ప్రత్యామ్నాయంగా దీర్ఘకాలికంగా ఆదాయాన్నిచ్చే ఉద్యానవన, వాణిజ్య పంటల సాగుకు పూర్తిస్థాయిలో ప్రోత్సాహం అందిస్తోంది. ఇందుకుగాను ఉపాధి హామీ పథకం నిధులను వెచ్చించింది. వీటితో ఉద్యానవన తోటల పెంపకం పెద్ద ఎత్తున గిరి రైతుల చేపడుతున్నారు.

9765 ఎకరాల్లో..

జిల్లాలో ఆపరేషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా ఈఏడాది గిరిజన రైతులు 9,765 ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగును చేపట్టారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో పది వేల ఎకరాలలో ఉద్యానవన తోటలు సాగుచేసే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో 9765 ఎకరాలలో 18 రకాల ఉద్యానవన పంటల సాగు చేపట్టారు. ఇందుకు గాను జిల్లా యంత్రాంగం రూ.5కోట్ల 55లక్షల 10వేల 945 ఉపాధి హామీ పథకం నిధులను వెచ్చించారు.

పండ్ల తోటల సాగు వివరాలు

వివిధ రకాల పండ్ల తోటలు, కలప జాతులతో భూములు కళకళలాడుతున్నాయి. నిమ్మ 614.5 ఎకరాలు, అవకడో ఐదు, బాంబో ఎనిమిది, జీడి మామిడి 3677.5, కొబ్బరి 177.5, సీతాఫలం 109, డ్రాగన్ ఫ్రూట్ 15.5, గువ 62, జాఫ్రా 29, జామ 161, మామిడి 75, మొరింగ 13, ఆయిల్‌పామ్ 134, పోమిగ్రానేట్ 8, సపోటా 571.5, సిల్వర్‌ఓక్ 3వేలు, కమలా 1012, చింత 91 ఎకరాల్లో సాగు చేపట్టారు. ఈమేరకు 26,70, 480 మొక్కలను ఉపాధి హామీ పథకంలో పంపిణీ చేశారు. మెట్ట, కొండ పోడు భూములు పండ్ల తోటలతో నిండుగా కనిపిస్తున్నాయి.

గిరి రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహిస్తున్నాం. గిరి రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా అధిక ఆదాయాన్నిచ్చే ఉద్యానవన పంటల మొక్కలను పంపిణీ చేశాం. గిరి శిఖర గ్రామాల్లో కాఫీ పంటల సాగును విస్తరిస్తున్నాం. దీనిలో భాగంగా 3వేల ఎకరాల్లో కాఫీ సాగు చేపట్టేందుకు నీడనిచ్చే సిల్వర్ మొక్కలను నాటుకున్నారు.

– సుమిత్‌కుమార్, కలెక్టర్, పాడేరు

మూతపడిన హరిత రెస్టారెంట్ పరిశీలన

అనంతగిరి: మండల కేంద్రంలో పదేళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న హరిత రెస్టారెంట్‌ను ఐటీడీఏ పీవో అభిషేక్ మంగళవారం పరిశీలించారు. ఇక్కడి ఉన్న ఆర్‌అండ్‌బీ గృహాన్ని లీజుప్రతిపాదికన పర్యాటకశాఖ తీసుకుని పర్యాటకశాఖ రెస్టారెంట్ ఏర్పాటుచేసిందని అధికారులు వివరించారు. పదేళ్లక్రితం పర్యాటకశాఖ ఈ రెస్టారెంట్‌ను మూసివేయడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారిందని వారు పేర్కొన్నారు. అయితే ఈ స్థలానికి సంబంధించి సర్వేచేయించి హద్దులు వేయాలని, అతిథి గృహం రెవెన్యూశాఖకు సంబంధించిన స్థలంలో ఉందా లేదా అనేదానిపై సర్వేచేయాలని వారికి సూచించారు. దీనిపై పర్యాటకశాఖకు నోటీసులు జారీ చేయాలని ఐటీడీఏ సిబ్బందికి సూచించారు. నిరుపయోగంగా ఉన్న అతిథి గృహ భవనాన్ని స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపడతామని పీవో వెల్లడించారు. ఎంపీడీవో శ్రీహర్షిత్, ఆర్ఐ శంకరరావు పాల్గొన్నారు.



అనంతగిరిలో నిరుపయోగంగా ఉన్నా హరిత రెస్టారెంట్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ అభిషేక్

నేటి నుంచి ఇంటర్ క్వార్టర్లీ పరీక్షలు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ క్వార్టర్లీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని అన్ని జూనియర్ కాలేజీల్లో విద్యా క్యాలెండర్ మేరకు పరీక్షలు నిర్వహించాలని ఆర్‌ఐవో రాయల సత్యనారాయణ వెల్లడించారు. రెగ్యులర్ కోర్సుల వారికి ఈ నెల 18 వరకు, ఒకేషనల్ విద్యార్థులకు ఈ నెల 17 వరకు పరీక్షలు జరపాలన్నారు. ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి జారీ చేసిన ప్రశ్నా పత్రాలతోనే పరీక్షలు నిర్వహించాలన్నారు.

తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

ఉదయం 9 గంటల వరకు దట్టంగా పొగమంచు



పాడేరు పాత బస్టాండ్ వద్ద దట్టంగా కమ్ముకున్న మంచు తెరలు



పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో ఉదయం 8 గంటల ప్రాంతంలో కురుస్తున్న మంచు

సాక్షి, పాడేరు: మన్యంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. శీతాకాలం రాకముందే వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సోమవారం రాత్రి 11గంటల నుంచి పాడేరు పరిసర ప్రాంతాల్లో మంచు దట్టంగా కురిసింది. మంగళవారం ఉదయం 9గంటల వరకు పాడేరు ప్రాంతంలో పొగమంచు దట్టంగా కురిసింది. వాహన చోదకుల హెడ్‌లైట్ల వెలుగులో రాకపోకలు సాగించారు. చింతపల్లి,అరకులోయ ప్రాంల్లో కూడా మంచు దట్టంగా కురుస్తోంది.పాడేరు మండలం మినుమూలూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 18 డిగ్రీలు, చింతపల్లి కాఫీబోర్డులో 22 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని అధికారవర్గాలు తెలిపాయి.

అర్థమయ్యేలా బోధించండి

ఉపాధ్యాయులకు గిరిజన సంక్షేమశాఖ సంచాలకుడు జేవీ మురళి సూచన

అనంతగిరి: విద్యాప్రమాణాలు మరింత మెరుగుకు అర్థమయ్యే రీతిలో బోధించాలని గిరిజన సంక్షేమశాఖ సంచాలకుడు జేవీ మురళి సూచించారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల-2 పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా టెన్త్ విద్యార్థినులతో ఆంగ్ల పాఠ్యాంశాన్ని చదివించారు. లెక్కలు చేయించి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. ఆశించిన స్థాయిలో వారి నుంచి ఫలితం కనిపించకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీసం పాఠ్య పుస్తకం చదవలేకపోతే ఎలా అని ఉపాధ్యాయురాలిని ప్రశ్నించారు. బోధనతీరులో మార్పు రావాలని, విద్యార్థినిలకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించి విద్యాప్రమాణాల మెరుగుకు కృషి చేయాలని సూచించారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనగా బోధన ఉండాలని ఆదేశించారు. ఐటీడీఏ పీవో అభిషేక్, ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ, ఎంఈవో బాలాజి పాల్గొన్నారు.



టెన్త్ విద్యార్థినులతో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ సంచాలకుడు మురళి

వర్సిటీలకు దిక్సూచిగా ఏయూ

- ఎన్ఐఆర్ఎఫ్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపడం పట్ల హర్షం
- నాలుగు విభాగాల్లో ఏయూకు పురస్కారాలు

ఏయూక్యాంపస్: రాష్ట్రంలో ఉన్నత విద్యకు దిక్సూచిగా, విద్యా రంగానికి మార్గదర్శిగా ఆంధ్ర విశ్వవిద్యాలయం నిలుస్తోందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మంగళవారం విజయవాడలో ఉన్నత విద్యశాఖ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో కేంద్ర విద్య శాఖ ప్రకటించే ఎన్ఐఆర్ఎఫ్ ర్యాకింగ్‌లో రాష్ట్రంలోనే ఏయూ నాలుగు విభాగాల్లో అత్యుత్తమ స్థానాల్లో నిలవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఓవరాల్ విభాగంలో ఏయూ, కళాశాలల విభాగంలో ఫార్మసీ, ఇంజినీరింగ్ కళాశాలలు, స్టార్టప్ ఇంక్యుబేషన్ రంగాల్లో ఆ హబ్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ.. నాలుగు జ్ఞాపికలను అందజేశారు. రాష్ట్ర విద్య శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఈ జ్ఞాపికలను స్వీకరించారు. కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి బొత్స సత్యనారాయణ నుంచి జ్ఞాపిక స్వీకరిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ మురళి



గిరిజన మహిళ నుంచి సమస్యలు తెలుసుకుంటున్న గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ మురళి, పీవో అభిషేక్



గిరిజనులతో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ మురళి, చిత్రంలో ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయ రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జేవీ మురళి తెలిపారు. మండలంలోని బొండం పంచాయతీ రేగ ఎంపీపీ పాఠశాల అవరణలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఐసీడీఎస్, ఆసరా సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన తిలకించారు. వైద్య పరీక్షల వివరాలను ఆయన తెలుసుకున్నారు. అనంతరం గిరిజనులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేదలందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రభుత్వ లక్ష్యం కోసం అధికారులు, సిబ్బంది అంకితభావంతో పని చేస్తూ విజయవంతం చేయడాన్ని ఆయన అభినందించారు. 290 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సహకార సంస్థ డీఎం సింహాచలం, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రావు, ప్రత్యేక వైద్యనిపుణుడు డాక్టర్ వివేక్, కావ్య, గోవర్ధన్‌రెడ్డి, సుంకరమెట్ట, మాడగడ, గన్నెల పీహెచ్‌సీ వైద్యులు కిర ణ్మయి, ఉపేంద్ర, మోహన్‌సాయి, శాంతి, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో వెంకటేష్, వివిధ శాఖల అధికారులు, గ్రామసచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం :
పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

చింతపల్లి రూరల్: ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలో బెన్నవరం గ్రామసచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఏజెన్సీ ప్రజలకు వరమని అన్నారు. ఏ ప్రభుత్వం ఇటువంటి ప్రజాప్రయోజన కార్యక్రమం చేపట్టలేదన్నారు. రోగులు బాధపడుతూ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లకుండా వారి వద్దకే వైద్యులు రావడం మంచి పరిణామమన్నారు. గిరిజనులు ఆరోగ్యంగా ఉండాలన్నది సీఎం జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటుచేసిన స్టాళ్లను ఆమె తిలకించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. వైద్య శిబిరంలో 520 మందికి వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, ఎంపీడీవో ఆశాజ్యోతి, తహసీల్దార్, లత్సాపాత్రుడు, వైద్యాధికారులు లక్ష్మీకాంతం, రమణబాబు, సుధాశారద, శ్రీహరి, జగదీష్, బెన్నవరం సర్పంచ్ సన్యాసమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, మండల కన్వీనర్ గణబాబు, ఎంపీటీసీలు ధారలక్ష్మి, జయలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ, పార్టీ ముఖ్య నాయకుడు జల్లీ సుధాకర్, ట్రైకార్ డైరెక్టర్ లోవరాజు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ తిరుపతి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వరం

పెదబయలు: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెదకోడాపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేదల ఆరోగ్యం, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. శిబిరంలో వైద్య నిపుణులు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు.శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడారు.

615 మందికి వైద్యసేవలు

వైద్యశిబిరంలో 615 మందికి వైద్య సేవలు అందించారు. వివిధ శస్త్రచికిత్సలకు సంబంధించి 54 మందిని రిఫరల్ చేసినట్టు ఎంపీడీవో విగ్గిన్స్ తెలిపారు. విశాఖకు చెందిన ఇద్దరు వైద్య నిపుణులు, ఎంపీపీ బొండా వరహాలమ్మ, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, వైస్ ఎంపీపీ రాజుబాబు, పార్టీ నాయకులు జర్సింగి సూర్యనారాయణ, ఎంపీటీసీ వంతాల అప్పారావు, సర్పంచ్ బట్టి చిట్టిబాబు, ఆర్ఐ సింహాచలం. ఐసీడీఎస్ సిబ్బంది, వైద్య సిబ్బంది.గ్రామ సచివాలయం, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



బెన్నవరంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



బెన్నవరంలో శిబిరానికి విచ్చేసిన గిరిజనులు



పెదకోడాపల్లిలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న అరకు ఎమ్మెల్యే తదితరులు



పెదకోడాపల్లిలో వైద్య శిబిరానికి భారీగా హాజరైన ప్రజలు



వృద్ధురాలికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

చిత్రలేఖనంలో రాజవొమ్మంగి విద్యార్థినికి బహుమతి



హారికను అభినందిస్తున్న రాజవొమ్మంగి పాఠశాల ఉపాధ్యాయులు

రాజవొమ్మంగి: ఇటీవల అమలాపురం, నేషనల్ ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీల్లో రాజవొమ్మంగి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని తోలాటి హారిక ప్రతిభ కనబరిచింది. ఎనిమిదో తరగతి చదువుతున్న ఈమె టాప్ టెన్‌లో నిలిచి ఈనెల 10న అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా మంశవారం ఆమెను హెచ్‌ఎం గోపాలకృష్ణ, డ్రాయింగ్ టీచర్ మిరియాల కొండబాబు తదితర ఉపాధ్యాయులు అభినందించారు.

12,13 తేదీల్లో యువజనోత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిస్టర్ షైజీ

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎక్సెల్సియార్–23 పేరిట ఈ నెల 12, 13 తేదీల్లో యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో యువజనోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు ఏయూ పరిధిలోని కళాశాలల విద్యార్థులు నమోదు చేసుకోవాలని కో–ఆర్డినేటర్ డాక్టర్ సుధ కోరారు. సుమారు 3 వేల మంది విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు డాక్టర్ పి.కె. జయలక్ష్మి తెలిపారు. 13న జరిగే ముగింపు ఉత్సవాలకు సినీ నటుడు సోహెల్, యూట్యూబ్ స్టార్ షణ్ముఖ్ జశ్వంత్ హాజరవుతారని వివరించారు.

క్లుప్తంగా

పోస్టల్ సేవలపై అవగాహన


కార్యక్రమంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

అరకులోయటౌన్: తపాల శాఖ సేవలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని, ఇందులో భాగంగా జనంలోకి మనం అనే కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు సబ్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర అన్నారు. జాతీయ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకొని అరకులోయ పోస్టల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పోస్టల్ సేవలను వివరించారు. జనంలోకి మనం కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు అకౌంట్‌లు, ఇన్సూరెన్స్ పాలసీలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పేమెంట్‌లు తీసుకునేందుకు వీలుగా 300 ప్రీమియం అకౌంట్‌లు ఒపెన్ చేసినట్లు చెప్పారు. తపాల సిబ్బంది, ఖతాదారులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధి పనులకు ప్రతిపాదనలు


సమావేశమైన ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు

వై.రామవరం: యార్లగడ్డ గ్రామ సచివాలయం పరిధిలోని గురమంద విశ్వనాధుని ఆలయ ప్రాంతాన్ని ఎకో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దటానికి ప్రతిపాదనలు తయారుచేసి, అటవీశాఖ అధికారులకు అందజేశారు. జిల్లా అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతనెలలో అడ్డతీగల అటవీశాఖ రేంజ్ అధికారి సయ్యద్ షహెన్‌షా ఆధ్వర్యంలో సర్వే చేసిన విషయం విదితమే. సర్పంచ్ పల్లాల పద్మావతి ఆధ్వర్యంలో మంగళవారం యార్లగడ్డలో నిర్వహించిన సమావేశంలో ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, అటవీశాఖ అధికారులు, గ్రామ పెద్దలు సమావేశమై పర్యాటకానికి మొదటి విడత నిధులు మంజూరుకు ప్రతిపాదనలు తయారుచేసి అటవీశాఖకు పంపించారు, వెంకటరమణారెడ్డి, గ్రామ పెద్దలు కనకరాజు, భార్గవచరణ్, అటవీశాఖ డిప్యూటీ రేంజి అధికారి సీహెచ్ సత్యనారాయ పాల్గొన్నారు.

చిట్టి తల్లులకు రక్షణ

బాలికలకు జగనన్న ఇచ్చిన తోడు ఇవే

చైల్డ్‌లైన్ 1098	దిశ 112	ఉమెన్ హెల్ప్‌లైన్ 181
ఏపీ పోలీసు 100	ఎమర్జన్సీ 108	మెడికల్ హెల్ప్‌లైన్ 104

బడి నుంచి ఇంటికి వెళ్లే సమయంలో మార్గమధ్యలో కాపుకాసి, రోజూ పలుకరిస్తుంటే స్నేహం చేసింది. కొద్దిరోజులు గడిచిన తరువాత తన వక్రబుద్ధి చూపాడు ఆ ప్రబుద్ధుడు. స్నేహం పేరుతో చేష్టలు శృతిమించుతున్నాయని భావించిన విద్యార్థిని దిశ 112 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి, జరిగిన తతంగాన్ని వివరించింది. మరుసటి రోజు మహిళా పోలీసులు స్కూల్‌కు వెళ్లే దారిలో మాటు వేసి, ఆ ప్రబుద్ధుడికి గట్టిగానే బుద్ధి చెప్పారు. విశాఖ నగరంలోని బస్టాండ్ ప్రాంతంలో జరిగిన ఘటన ఇది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బాలికలకు భరోసా కల్పించేలా చేసిన ఏర్పాట్లతో వారిలో చైతన్యం వచ్చిందనడానికి ఇదో నిదర్శనంగా నిలుస్తోంది.

ఇది గుడ్‌టచ్....ఏది బ్యాడ్ టచ్ అనేది తెలుసుకునేలా యుక్త వయస్సు బాలికల్లో అవగాహన కల్పించేలా పాఠశాల స్థాయిలోనే చేసిన ఏర్పాట్లు సత్ఫలితాలు ఇస్తున్నాయి. బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతో జిల్లా విద్య, స్త్రీ శిశు సంక్షేమ, పోలీసు శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని 1,385 పాఠశాలలు, 173 జూనియర్ కాలేజీల్లో పోక్సో చట్టంపై అవగాహన కల్పించేలా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

- లైంగిక వేధింపులకు అడ్డుకట్ట
- పాఠశాలల్లో 'భరోసా బాక్స్'
- గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన
- సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీ
- విద్యార్థినులకు 'జగనన్న తోడు'పై విస్తృత ప్రచారం
- నేడు అంతర్జాతీయ బాలిక దినోత్సవం




టోల్ ఫ్రీ నంబర్లుతో ముద్రించిన పోస్టర్లు

విశాఖ విద్య: ప్రతీ పాఠశాల, జూనియర్ కళాశాలల్లో హెచ్‌ఎం గదికి సమీపంలో అందరికీ కనిపించేలా బాలికల కోసమని ప్రత్యేకంగా 'భరోసా బాక్స్' ఏర్పాటు చేశారు. బాక్స్‌కు తాళం వేసి, దానిని ప్రతీ పదిహేను రోజులకోకసారి ఎంఈవో పర్యవేక్షణలోని కమిటీ సభ్యులైన మహిళా పోలీసు, వైద్యారోగ్యశాఖ ఏఎన్ఎం సమక్షంలో తెరుస్తున్నారు. ఏమైనా ఫిర్యాదులు లేదా సూచనలు, సలహాలు ఉంటే, వాటిని వేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచి, పరిష్కారం కోసం సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు.

ఇదిగో బాలికా వికాసం

ఆడపిల్ల అంటే గర్భంలోనే చిదిమేసే వారు ఒకప్పుడు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం బాలికా సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలతో బాలికా వికాసం విరాజిల్లుతోంది. జిల్లాలో ఇంటర్మీయెట్ చదివే వారిలో బాలురు 42,037 మంది ఉంటే, బాలికలు 37,041 మంది ఉన్నారు. 1 నుంచి 10వ తరగతి చూసినట్టయితే అబ్బాయిలు 1,84,295 మంది కాగా, అమ్మాయిలు 1,65,465 మంది ఉన్నారు. 3 నుంచి 6 ఏళ్ల వయస్సులో అబ్బాయిలు 25,740 మంది కాగా, అమ్మాయిలు 25,036 మంది ఉన్నారు. అదే 7 నెలల నుంచి 3 ఏళ్లలోపు మధ్య వారిలో అబ్బాయిలు 16,715 మంది కాగా, అమ్మాయిలు 16,621 మంది ఉన్నారు. ఈ లెక్కన గతంలో కన్నా క్రమేపీ అమ్మాయిల సంఖ్య పెరుగుతోందని ఈ గణాంకాలు చెబుతున్నాయి.

పటిష్టమైన చర్యలు



జిల్లాలోని అన్ని పాఠశాలల్లో భరోసా బాక్స్‌లను ఏర్పాటు చేశాం. కౌమార విద్యపై ఓ మహిళా ఉపాధ్యాయురాలికి బాధ్యత అప్పగించాం. విద్యా క్యాలెండర్‌లో కూడా బాలికా సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. ఆ దిశగానే తగిన చర్యలు తీసుకుంటున్నాం. – ఎల్.చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

బాల్య వివాహాలు తగ్గాయి



బాలికా విద్య ప్రాధాన్యతపై అంగన్‌వాడీల స్థాయిలోనే తగిన అవగాహన కల్పించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చనేది తెలియజేస్తున్నాం. గతంలో కన్నా బాల్య వివాహాలు బాగా తగ్గాయి. వీటిపై మరింత అవగాహన కల్పిస్తున్నాం. – డి.వెంకటేశ్వరి, స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్, విశాఖ జిల్లా

లైగింక వేధింపులు సహించేది లేదు



విద్యార్థినులను లైంగికంగా వేధించినట్లు తేలితే అలాంటి వారిని కఠినంగా శిక్ష విధించేలా చట్టాలు ఉన్నాయి. వీటిపై పాఠశాలలు, కాలేజీల స్థాయిలో విస్తృత చర్చ జరగాలి. ఉపాధ్యాయులతో పాటు, తల్లిదండ్రులు కూడా భాధ్యత తీసుకోవాలి. – ఎంఆర్ఎల్. రాధ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్ పర్సన్

బాలికలకు రక్షణగా నిలుస్తాం



బాలికలకు భరోసాగా నిలవాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయం. బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే ఉపేక్షించబోం. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని అన్ని పాఠశాలల్లో భరోసా బాక్స్‌ను ఏర్పాటు చేయాలి. అత్యవసర ఫోన్ నంబర్లు గోడలపై రాయించాలి. – డాక్టర్ జి. సీతారాం, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు, విశాఖ

గిరిజన చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: గిరిజన చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకొని తోటి గిరిజనులకు కూడా వాటిపై అవగాహన కల్పించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే అన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో రాష్ట్ర సీఐడీ అడిషనల్ డీజీపీ ఎన్. సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు, చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీవో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసులపై ప్రత్యేక శ్రద్ధ చూపి తగు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. యువత రాయితీపై రుణాలు మంజూరు చేసినట్టు చెప్పారు. యువకులకు డ్రైవింగ్ లైసెన్సు ఉంటే రాయితీపై వాహనాలు మంజూరు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. అట్రాసిటీ కేసులకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చిన వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్లలో ముందుగా ఎఫ్ఆర్ నమోదు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి ముందు సీఐడీ అడిషనల్ సూపరింటెండెంట్లు సురేష్, కృష్ణమూర్తినాయుడు, డీఎస్పీ పెంటారావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఏఎస్పీ జగదీష్, సీఐలు రవికుమార్, సత్యనారాయణ. నరసింహరావు, సురేష్‌బాబు, ఎస్ఐలు మోహనరావు.జేమ్స్, గాయత్రి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, గిరిజన సంఘ నాయకులు, గిరి యువతీ యువకులు పాల్గొన్నారు.

దసరాకు స్పెషల్ బస్సులు 500కు పైనే!

- విజయవాడ, హైదరాబాద్‌లకు అధిక సర్వీసులు
- దసరాకు ముందు.. తర్వాత నడిపేలా సన్నాహాలు
- 19 నుంచి అందుబాటులోకి స్పెషల్ సర్వీసులు
- ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలే వసూలు



సాక్షి, విశాఖపట్నం: దసరాకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడవడానికి సన్నద్ధమవుతోంది. ఈ పండక్కి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం నడుస్తున్న రెగ్యులర్ సర్వీసులకు అదనంగా వీటిని నడపనుంది. ఆర్టీసీ విశాఖ రీజియన్ నుంచి ఈ దసరాకు 500కు పైగా బస్సులను అందుబాటులో ఉంచుతోంది. వీటిని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాద్‌కు పంపడానికి ప్రణాళిక రూపొందించింది. ఈ నెల 23న దసరా పండుగను జరుపుకుంటున్నారు. అంతకు ముందుగానే పలువురు తమ స్వస్థలాలకు పయనమవుతారు. ఏటా దసరాకు హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి విశాఖకు, ఉత్తరాంధ్ర జిల్లాలకు పెద్ద సంఖ్యలో జనం వస్తుంటారు. అందువల్ల ఈ నెల 19, 20, 21, 22 తేదీల్లో హైదరాబాద్ నుంచి రోజుకు 20 బస్సులు, విజయవాడ నుంచి 10 బస్సులు చొప్పున నడపనున్నారు. ఇంకా విశాఖ నుంచి ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు వెళ్లే వారి కోసం కూడా 22, 23 తేదీల్లో 200 వరకు బస్సులను తిప్పనున్నారు. అలాగే దసరా అనంతరం ఉత్తరాంధ్ర, విశాఖల నుంచి రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్‌ల వైపు తిరుగు పయనమయ్యే ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని మరో 200 బస్సులకు పైగా ఆయా ప్రాంతాలకు పంపించనున్నారు. వీటిని ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు నడపనున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు.

మరోవైపు ప్రయాణికుల సౌకర్యార్థం ఇప్పటికే ఆర్టీసీ రిజర్వేషన్ సదుపాయాన్ని అందుబాటులో ఉంచింది. ముందస్తుగా కొంతమంది ఇప్పటికే రిజర్వేషన్ చేయించుకుంటున్నారు.

స్పెషల్స్‌లోనూ సాధారణ చార్జీలే..


సంక్రాంతి, దసరా వంటి పండగ రోజుల్లో పండగలకు సొంతూళ్లకు వెళ్లే వారికి సంఖ్య అధికంగా ఉంటుంది. ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా స్పెషల్స్ పేరిట ఆర్టీసీ అదనపు బస్సులు నడుపుతుంటుంది. ఈ స్పెషల్ బస్సుల్లో సాధారణ బస్సుల్లో టిక్కెట్టు చార్జికంటే 50 శాతం అదనంగా వసూలు చేస్తుంది. ఉదాహరణకు రూ.100 సాధారణ టికెట్ చార్జి ఉంటే రూ.150 చెల్లించాల్సి ఉంటుంది. ఈ స్పెషల్ బస్సుల్లో ఒకవైపే ప్రయాణికుల రద్దీ ఉండడం, రెండో వైపు ఖాళీ రావల్సి వస్తుండడంతో ఇలా అదనపు చార్జీలు వసూలు చేసేది. ఈ విధానం కొన్నేళ్లుగా ఆర్టీసీలో రివాజుగా వచ్చేది. దీంతో ప్రత్యేక బస్సుల్లో అదనపు బాదుడు బెంగ ప్రయాణికుల్లో ఉండేది. కానీ ఈ దసరాకు నడిపే ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించే వారికి ఆర్టీసీ శుభవార్త చెప్పింది. ఈ స్పెషల్ బస్సుల్లో మునుపటిలా అదనపు చార్జీలు వసూలు చేయడం లేదని తెలిపింది. అంటే ఈ ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ బస్సు చార్జీలే ఉంటాయన్న మాట! ఇది దసరా ప్రయాణికులకు ఊరట కలిగించనుంది.

పాలసీదారులకు మెరుగైన సేవలు


గంగవరం పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎల్ఐసీ బీఎం విద్యాసాగర్ తదితరులు

గంగవరం : జీవిత బీమా సంస్థ గోకవరం బ్రాంచ్ రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో పాలసీదారులకు మెరుగైన సేవలు అందించడం జరుగుతుందని గోకవరం ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ విద్యాసాగర్ అన్నారు. స్థానిక పాలసీదారుల సేవా కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ పాలసీదారులకు సేవలు అందించడంలో క్లెయిమ్స్ సత్వర పరిష్కారంలో గోకవరం బ్రాంచ్ ప్రథమ స్థానంలో ఉందన్నారు. గోకవరం బ్రాంచ్ లక్ష్యసాధనలో 7200 పాలసీల సేకరణతో రూ 7.5 కోట్లు మొదట ప్రీమియం, రూ.5 కోట్ల సింగల్ ప్రీమియం సాధించాల్సి ఉండగా పాలసీలు, మొదటి ప్రీమియం సేకరణలో 50 శాతం, సింగల్ ప్రీమియం సాధనలో 90 శాతం వార్షిక బడ్జెట్ పూర్తయిందన్నారు. విస్తృతంగా ఆన్లైన్ సేవలు అందుబాటులోకి రావడం జరిగిందన్నారు. అనంతరం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాలలో బీఎం విద్యాసాగర్ మొక్కలు నాటారు. ఏఏఓ ఎ.శ్రీనివాస్, హెచ్ఎంఝాన్సీ హెన్సన్, డిప్యూటీ వార్డెన్ లక్ష్మీ కాంతం పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో లాభాలు


చీడపీడల నివారణకు కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జి.మాడుగుల: మండలంలో సింగర్ల పంచాయతీ ఎం.నిట్టాపుట్టు యూనిట్ పరిధిలో పాలకొండ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తున్న గులిరాగి, పలు పంటలను గురువారం జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ లాలం భాస్కర్, స్టేట్ రీసోర్స్‌పర్సన్ దేముడు సందర్శించారు. ఆయా పంటల గురించి నేరుగా రైతులను వారు అడిగి తెలుసుకున్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ భాస్కర్ మాట్లాడుతూ ప్రతీ సీజనల్‌లో పంటలతో భూమిపొర కప్పి ఉండడంతో జీవవైవిధ్యం మెరుగుపడుతుందన్నారు. స్టేట్ రీసోర్స్ పర్సన్ దేముడు మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు సాధించడంతో రైతులు లాభాలు పొందవచ్చన్నారు. ఎం.నిట్టాపుట్టు ఇన్‌చార్జి ఎం.ప్రసాద్, ఇన్‌చార్జిలు వెంకట్, ప్రసాద్, పాపారావు, రైతులు పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని సీకరి గ్రామ మైఖ్య సంఘం ఏపీ కమ్యూనిటీ సహాయ వ్యవసాయ మండల రిసోర్స్ పర్సన్ జి.శాంతి కుమారి ఆధ్వర్యంలో రైతులకు చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేడు, జామ, మండి, బొప్పాయి, ఆముదం తదితర పదార్థాలతో చీడపీడల నివారణ కషాయాన్ని తయారు చేశారు. ఈ కషాయం ఉపయోగాన్ని రైతులకు వివరించారు. కషాయం ఆరు నెలల వరకు నిల్వ ఉంటుందనానరు. ఇన్‌చార్జీ మత్స్యరాజు,మహిళ రైతులు పాల్గొన్నారు.

గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: బుధవారం షాలిమార్‌లో బయల్దేరవలసిన షాలిమార్–నాగర్‌కోయల్ (12660) గురుదేవ్ ఎక్స్‌ప్రెస్‌ను పెయిరింగ్ రైలు ఆలస్యం కారణంగా రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం 10.15 గంటలకు బెంగళూరులో బయల్దేరవలసిన బెంగళూరు – అగర్తలా (12503) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ సుమారు 10గంటలు ఆలస్యంగా రాత్రి 8గంటలకు బయల్దేరింది.

గంజాయి సాగుదారులపై కేసు


పాడేరు సీఐ సుధాకర్


ఓలుబెడ్డలో గంజాయి మొక్కను పరిశీలిస్తున్న పాడేరు ఏఎస్పీ ధీరజ్

పాడేరు రూరల్: ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు పాడేరు ఏఎస్పీ ధీరజ్ పర్యవేక్షణలో పాడేరు, హుకుంపేట మండలాల్లోని మారుమూల గ్రామాల్లో సాగు చేస్తున్న గంజాయి తోటలను అధునాతనమైన డ్రోన్ కెమెరాల సహాయంతో గుర్తించామని పాడేరు సీఐ సుధాకర్ తెలిపారు. గంజాయి తోటలను గుర్తించి గత నెల, ఈ నెలలో సాగు చేస్తున్న వారిపై ఎనిమిది కేసులు నమోదు చేసి తొమ్మిది మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. పాడేరు మండలం కించూరు పంచాయతీ బొంగజంగి, తోటలగొంది, ఇరడాపల్లి పంచాయతీ సరియాపల్లిలో ఒక్కొక్క కేసు చొప్పున నమోదు చేశామన్నారు. హుకుంపేట మండలం గన్నేరుపుట్టు పంచాయతీ పోర్లు గ్రామంలో ఒక కేసు, తీగలవలస పంచాయతీ ఓలుబెడ్డలో, మత్స్యపురం పంచాయతీ పెడబొరుగులలో రెండు కేసుల చొప్పున నమోదు చేశామన్నారు. ఈ విషయంలో గ్రామ సచివాలయ, రెవెన్యూ సిబ్బంది సహకారం తీసుకున్నామన్నారు. గంజాయి సాగు, రవాణా, అమ్మకాలను చేపట్టి జీవితాలను ఛిద్రం చేసుకోవద్దని సూచించారు. ఎక్కడైనా గంజాయి సాగుపై తమకు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

కేకే లైన్ రెడీ

మంగళవారం నుంచి రాకపోకలు సాగిస్తున్న గూడ్స్ రైళ్లు


ప్రయాణిస్తున్న గూడ్స్ రైలు

తాటిచెట్లపాలెం: కొత్తవలస-కిరండూల్ (కేకేలైన్) కోరాపుట్ – జగదల్‌పూర్ సెక్షన్ మనబార్-జరాటి స్టేషన్ పరిధిలో ఎడతెరిపిలేని వర్షాలు వలన రైల్వే ట్రాక్‌పై గత నెల 24న భారీ కొండచరియలు విరిగిపడిన విషయం తెలిసిందే. ఈ కారణంగా ఈ మార్గంలో అప్పటి నుంచి రైళ్ల రాకపోకలు నిలిపివేసి పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ పనులు మంగళవారంతో పూర్తయ్యాయి. వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ మంగళవారం స్వయంగా ఈ లైన్‌లో పర్యటించి పనులను, ట్రాక్ పునరుద్ధరణను దగ్గరుండి పర్యవేక్షించారు. ఘటన జరిగిన తరువాత ఈస్ట్‌కోస్ట్‌రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ కూడా పలు మార్లు ఈ సంఘటనా స్థలాన్ని భువనేశ్వర్ ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ ప్రాంతంలో సుమారు 10వేల క్యూబిక్ మీటర్ల మట్టి (భారీ చెట్లు, బండరాళ్లతో) ట్రాక్‌పై పడ్డాయి. సుమారు 450 మంది కార్మికులు, భారీ యంత్రాలతో నిపుణులైన అధికారం బృందంతో డీఆర్ఎం యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తిచేయించారు. ఈ పనుల నిమిత్తం చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్ ఇద్దరు చీఫ్ ఇంజనీర్లతో కలిసి ఘటనా స్థలంలోనే సుమారు 17 రోజులు ఉండి పనులను పూర్తి చేయించారు. రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్, లక్నో, ఇండియన్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సివిల్ ఇంజినీరింగ్ పూనేల నుంచి నిపుణులైన బృంద సభ్యులు పునరుద్ధరణ చర్యల్లో పాల్గొన్నారు.

24/7 పనులను చేసి ఎట్టకేలకు మంగళవారం ఈ పనులను పూర్తిచేసి, ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు అనుమతులిచ్చారు. జగదల్‌పూర్-కిరండూల్‌లో లోడింగ్ పూర్తయిన తరువాత వైజాగ్ స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు, జిందాల్ స్టీల్, అర్సెలర్ మిట్టల్, వెల్‌స్పన్ వంటి కంపెనీలకు చేరుకోవలసిన సుమారు 12 గూడ్స్ రైళ్లను మంగళవారం పంపించారు. వాల్తేర్ డివిజన్ నుంచి కూడా నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి సరకును తీసుకువచ్చేందుకు ఆరు ఖాళీ గూడ్స్ రేక్‌లను బచేలి, కిరండూల్‌లకు పంపించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పునరుద్ధరణ పనులను పూర్తిచేసిన కన్‌స్ట్రక్షన్ టీం, వాల్తేర్ టీంలకు డీఆర్ఎం అభినందించారు.

స్టీల్‌ప్లాంట్‌కు తొలగిన ఆటంకాలు

ఉక్కునగరం: కేకే లైనులో ఏర్పడిన అవాంతరాల వల్ల ఐరన్ ఓర్ సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్న స్టీల్‌ప్లాంట్‌కు శుభవార్త. కేకే లైను నుంచి ఐరన్ ఓర్ సరఫరా పునఃప్రారంభమైంది. ఎన్ఎండీసీకు చెందిన బైలదిల్లా గనుల నుంచి ఐరన్ ఓర్ సరఫరా నిలిచిపోయింది. మరోవైపు ప్లాంట్‌లో ఐరన్ ఓర్ నిల్వలు కనిష్ఠ స్థాయికి చేరుకోవడంతో నడుస్తున్న రెండు బ్లాస్ట్‌ఫర్నేస్‌ల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. రైల్వేశాఖ నిరంతర ప్రయత్నాల వల్ల కేకే లైన్ మంగళవారం పునరుద్ధరించడంతో స్టీల్‌ప్లాంట్‌కు ఐరన్ ఓర్ సరఫరాకు ఆటంకాలు తొలగిపోయాయి.